క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

అమరచింత: మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ డాక్టర్ మాలతి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతున్నట్లు వెల్లడించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

కంటివెలుగుపై అవగాహన...

ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11గంటలకు కంటివెలుగు కార్యక్రమంపై సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. అవగాహన కార్యక్రమం అనంతరం సర్వసభ్య సమావేశం కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.

రేపు 'కంటివెలుగు'పై అవగాహన

పాన్‌గల్: ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభించే కంటి వెలుగు కార్యక్రమంపై స్థానిక ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే మెరుగైన వైద్యం

వీపనగండ్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం అందుతుందని, గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించుకోవాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. శనివారం అర్ధరాత్రి విజిత అనే మహిళకు కాన్పు అయ్యిందని, తల్లీ, కూతురు క్షేమంగా ఉన్నారని తెలిపారు. ఉమ్మడి మండలంలో దాదాపు 40గ్రామాలు ఆస్పత్రి పరిధిలో ఉన్నాయని, 54 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

పాన్‌గల్: మహిళల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బాల్యానాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో మహిళా శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యానాయక్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమయ్యాయని అన్నారు. మహిళలకు రక్షణ కరువైందని, ఎక్కడ చూసినా దాడులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. కఠిన చర్యలు తీసుకోకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైన మహిళలకు ఇచ్చిన హామీలను అమలు కోసం అందరూ కలిసికట్టుగా ఉద్యమించాలన్నారు. సమావేశంలో చిట్టెమ్మ, శాంతమ్మ, లక్ష్మి, చంద్రమ్మ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి సన్మానం



మదనాపురం: డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌ను ఆదివారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. జిల్లాలో పార్టీ బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమిష్టిగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వడ్డెకృష్ణ, ప్రశాంత్, కష్టారెడ్డి, రామచంద్రయ్య, వేమన్న, సత్యశీలారెడ్డి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



మదనాపురం: ఉత్తరాయణం, భోగి, సంక్రాంతి పండుగల విశిష్టతపై ఆదివారం కొన్నూరులో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక 100రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. సంక్రాంతి పండుగ విశిష్టత గురించి ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు బాలకృష్ణ, వేణు, గోపాల్ పాల్గొన్నారు.

మూత్రశాలలు నిరుపయోగం

అమరచింత: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్డి మరమ్మతుకు నోచుకోలేక మరుగునపడ్డాయి. ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. 23ఏళ్ల కిందట నిర్మించిన బస్టాండ్‌లో కనీస వసతులు కరువయ్యాయి. అయినా అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్వామి వివేకానంద జీవితం ఆదర్శం

- యువజన వారోత్సవాలు
- క్రీడాపోటీలను ప్రారంభించిన అధికారులు



గోపాల్‌పేటలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కొత్తకోట: యువతకు స్వామి వివేకానంద జీవితం స్ఫూర్తిదాయకమని, క్రీడలతో స్నేహభావాలు పెంపొందుతాయని కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

ఉపన్యాస పోటీలు..

వనపర్తి టౌన్: విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహిస్తే ఆలోచనతత్వం పెంపొందుతుందని ఏబీవీపీ నగర కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జ్యోతి, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ కవిత, కేదారనాథ్, శివ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా చూడాలని పెద్దమందడి ఎస్‌ఐ హరిప్రసాద్ అన్నారు. యువజన వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, యువకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎస్‌ఐ 2కే రన్ నిర్వహించారు. అనంతరం వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

పెబ్బేరు: నేటి తరం యువతకు స్వామి వివేకానందుడు స్ఫూర్తిదాయకమని ఎస్‌ఐ రామస్వామి అన్నారు. వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో 2–కే రన్ నిర్వహించారు.

పెబ్బేర్‌రూరల్(శ్రీరంగాపూర్): స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని ఎంపీపీ గాయత్రి, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ అన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలే నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లేష్, సర్పంచ్ వినీలారాణి పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలో ఆదివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ యూత్ డే సందర్భంగా మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ సంధ్య, జెడ్పీటీసీ భార్గవి, సీఐ ప్రవీణ్‌కుమార్ హాజరై టోర్నీని ప్రారంభించారు. ఎంపీపీ సంధ్య బ్యాటింగ్ చేయగా, జెడ్పీటీసీ భార్గవి బౌలింగ్ వేసి టోర్నీని ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ ప్రవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సాహించాలని ప్రభుత్వం క్రీడా మైదానాలను ఏర్పాటు చేసిందని ఎంపీపీ కమలేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామన్‌గౌడ్, సర్పంచ్ నరసింహారెడ్డి, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, హెడ్ కానిస్టేబుల్ శాంతయ్య పాల్గొన్నారు.



కొత్తకోటలో విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి



పెబ్బేరులో 2–కే రన్‌లో పాల్గొన్న ఎస్‌ఐ రామస్వామి, విద్యార్థులు



వీపనగండ్లలో..



బహుమతి అందజేస్తున్న పెద్దమందడి ఎస్‌ఐ హరిప్రసాద్

భక్తిశ్రద్ధలతో బీరప్ప దేవర ఉత్సవాలు



ఆత్మకూర్‌లో పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్: కురుమ కులస్తుల ఆరాధ్యదైవం బీరప్ప స్వామి దేవర్లు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆత్మకూర్, ఖానపూర్ గ్రామాలకు చెందిన కురుమలు తెల్లవారుజామున ఊరేగింపుగా కృష్ణానదికి వెళ్లి అక్కడ విగ్రహాలను శుద్ధిచేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకీలో పట్టణ పురవిధులగుండా ఊరేగింపుగా ఆలయాలకు చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మల్లేష్, చింతలన్న, కుర్వరవి, అనంతరాములు, సుధీర్, జీవేంద్రుడు, బాలస్వామి పాల్గొన్నారు.

అభిషేకాలు..



అమరచింతలో..

అమరచింత: బీరప్ప దేవర్ల ఉత్సవాలను కురువ కులస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం బీరప్ప స్వామి ఆలయంలో పూజలను నిర్వహించి దేవర్ల ఉత్సవ విగ్రహలను పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో పూజారి గోపి, కుర్వ వీరేష్, రాము, కురుమన్న, తిమ్మన్న, ఈదన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనకే పరిమితం



కంపచెట్లు, గుంతలుగా ఉన్న పర్వతాపురం రోడ్డు

- అప్పారెడ్డిపల్లి-ఆముదంబండ తండాకు రోడ్డు లేక ఇబ్బందులు
- రోడ్డు, బ్రిడ్జి పనులకు రూ.5.90కోట్లు మంజూరు
- ఏడాదిన్నర కావస్తున్నా ప్రారంభం కాని పనులు

ఖిల్లాఘనపురం: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బీటీ రోడ్డు శంకుస్థాపనకే పరిమితమైంది. మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి పలు గ్రామాలు, గిరిజన తండాలను కలుపుతూ కర్నెతండా మీదుగా నేరుగా వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు సులువుగా ఉంటుంది. అదేవిధంగా వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఈదారి వెంట ప్రభుత్వం బీటీ రోడ్డు వేస్తుందన్న విషయం తెలిసి పలు గ్రామాలు, గిరిజన తండాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కానీ ఏడాదిన్నర కావస్తున్నా పనులు ప్రారంభించకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

రూ.5.90కోట్లతో..

మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి పర్వతాపురం, గార్లబండ తండా మీదుగా ఆముదంబండ తండా మలుపు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్‌యోజన(పీఎంజీఎస్‌వై) పథకం ద్వారా ఈ రోడ్డు నిర్మాణంతో పాటు మధ్యలో అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం గ్రామాల శివారు మధ్యలో ప్రవహిస్తున్న పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి కూడా నిధులు మంజూరు అయ్యాయి. రోడ్డుకు రూ.4.70కోట్లు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.20కోట్లు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణానికి కావాల్సిన నిధుల మంజూరుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

ఏడాదిన్నర కిందట శంకుస్థాపన..

అప్పారెడ్డిపల్లి గ్రామం నుంచి ఆముదంబండ తండా రోడ్డు వరకు 7.3 కిలోమీటర్ల పొడువునా ప్రభుత్వం బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడం కోసం నిధులు మంజూరైన వెంటనే 2021 జూలై 8న అప్పారెడ్డిపల్లిలో మంత్రి నిరంజన్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. వెంటనే పనులు పారరంభించాలని అధికారులను ఆదేశించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నేటికి పనులు ప్రారంభించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతనిధులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



అప్పారెడ్డిపల్లి నుండి పర్వతాపురం, గార్లబండ తండా మీదుగా ఆముదం బండ తండా వరకు 7.3 కిలోమీటర్ల రోడ్డుకు ప్రభుత్వం నుండి నిధులు మంజూరుకావడం జరిగింది. రోడ్డుకు టెండర్ పక్రియ కూడ పూర్తయింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడం లేదు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.

– కబీర్‌దాస్, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లికి చెందిన మాజీ జర్నలిస్టు సహదేవ్ అనారోగ్యంతో మృతిచెందడటంతో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేఖర్, బీఆర్ఎస్ నాయకులు శేఖర్‌యాదవ్, సాయిబాబ, నాగరాజు, బాలపీరు, రామకృష్ణ, రాములు ఉన్నారు.

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో..

అనారోగ్యంతో మృతిచెందిన మాజీ జర్నలిస్టు సహదేవ్ కుటుంబాన్ని మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నయ్యూమ్‌ఖాన్, రాఘవేందర్‌గౌడ్, రాములుయాదవ్, కాశీనాథ్, రాములు పరామర్శించి సానుభూతి తెలిపారు.

ఆర్థికసాయం..

గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తికి చెందిన రవీందర్ ప్రమాదంలో మరణించాడు విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. మండల అధ్యక్షుడు శాంతన్న ద్వారా ఆర్థికసాయంగా ఆదివారం రూ.10వేలు అందించారు.

ఆత్మకూర్: పట్టణంలోని 6వ వార్డులో అనారోగ్యంతో మృతిచెందిన జక్కన్న(60) అంత్యక్రియల కోసం మాజీ వార్డు సభ్యుడు గడ్డమీది శ్రీనివాసులు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో కమాల్, గట్టన్న, పాపారాయుడు, సుదర్శన్‌చారి, సామిత్ తదితరులు ఉన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా పోటీకి సిద్ధం



వనపర్తి: ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. పోటీకి జనసేనా పార్టీ సిద్ధంగా ఉందని పార్టీ వనపర్తి జిల్లా కోఆర్డినేటర్ ముకుందనాయుడు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సూచన మేరకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. బడుగు, బలహీన వర్గాలకు పార్టీ అవకాశాలు కల్పిస్తుందని, సామాజిక న్యాయం జనసేనతో సాధ్యమన్నారు. సమావేశంలో నాయకులు బాలకృష్ణ, శరత్ గౌడ్, సురేష్‌యాదవ్, శేఖర్, ఉత్తేజ్, ఆర్.కృష్ణ, రమాకాంత్, అక్షయ్ కుమార్, శివ, మణిబాబు, రాములు, మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

బకాయిలకు జమ చేయడం సరికాదు



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్: రైతుబంధు డబ్బులను బ్యాంకు అధికారులు పాత బకాయిల కింద జమ చేసుకోవడం సరికాదని సీపీఐ జిల్లా మాజీ కౌన్సిల్ సభ్యుడు బాలస్వామి అన్నారు. ఆదివారం తెల్లరాళ్లపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల ఖాతాల్లో రైతుబంధు, ఇతర సంక్షేమ పథకాల నగదు జమ అయితే అట్టి నగదును బ్యాంకు అధికారులు రైతుల అప్పుల కింద జమ చేసుకుంటుండటంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం రైతుల రుణ మాఫీ చేయకపోవడంతో ఈ దుస్థితికి కారణం అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతుల ఖాతాల్లో జమ అవుతున్న రైతుబంధు నగదు, ఇతర సంక్షేమ పథకాల నగదును అప్పుల కింద జమచేసుకోకుండా బ్యాంకు అధికారులు తగిన సూచనలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి బ్యాంకుల ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సహదేవ్, లింగన్న, హరీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వీపనగండ్ల: మహనీయుల ఆశయ సాధన కోసం పనిచేసినప్పుడే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో మహనీయుల మల్టీకలర్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ రామన్‌గౌడ్, కేవీపీఎస్ మండల కార్యదర్శి మురళి, ప్రజా సంఘాల నాయకులు స్వామి, ఆశన్న, ఈశ్వర్, శరత్, వెంకటేష్, రాము, గోపి, ముత్యాలు, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ పరీక్షలు

కొత్తకోట: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో 'గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్' కరాటే ఆకాడమీకి చెందిన విద్యార్థులకు ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్లు మాస్టర్ అబ్దుల్ నబీ తెలిపారు. పట్టణ కేంద్రంతో పాటు పాలెం, రామనంతాపురం, మదనాపురానికి చెందిన 100మంది విద్యార్థులు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో పాల్గొన్నారు. కిక్స్, కటాస్, కుమితే, కాంబినేషనర్స్, బ్యాలెన్స్, జంపింగ్‌నేషన్ వంటి విభాగాల్లో పరీక్షలు నిర్వహించగా, ఎల్లో బెల్ట్ 30 మంది, గ్రీన్ బెల్ట్ 20 మంది, ఆరెంజ్ బెల్ట్ 25మంది, బ్లూ బెల్ట్ 20మంది, మెరూన్ బెల్ట్ ముగ్గురు, బ్రౌన్ ఇద్దరు ఉన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్లు జాఫర్, హరీష్‌యాదవ్, సాధిక్, పరమేష్, జాంగీర్, ఇంతియాజ్, మంజునాథ్, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

డ్రమ్‌సీడర్ విధానంపై రైతులకు అవగాహన



డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేస్తున్న రైతు

మదనాపురం: మండలంలోని కొన్నూరులో ఆదివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో యాసంగిలో వరి పంటలను డ్రమ్‌సీడర్ విధానంలో సాగుపై రైతులకు ఏఈఓ స్పందన అవగాహన కల్పించారు. డ్రమ్ సీడర్‌తో విత్తుకోవడం ద్వారా అనేక లాభాలు ఉంటాయని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా డ్రమ్స్ సీడర్ కొన్నూరులో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా విత్తడం వల్ల తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుందని, మొక్కకు, మొక్కకు 20 సెంటీమీటర్ల దూరం ఉండడం ద్వారా గాలి ప్రసరణ బాగా జరిగి అధిక పిలకలు వస్తాయని వివరించారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో కేఎల్ఐ కాల్వల తవ్వకంలో భూములు కోల్పోయిన రైతులకు భూ పరిహారం మంజూరు కావడంతో ఎంపీటీసీ మిద్దె కృష్ణ ఆధ్వర్యంలో రైతులు ఆదివారం సీఎం కేసీఆర్, వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గ్రామంలో 61 మంది రైతులకు సంబంధించి 27 ఏకరాలు కాల్వల తవ్వకంలో కోల్పోవడంతో ఒక్కో రైతుకు రూ.5లక్షల చొప్పున మొత్తం రూ.1.37కోట్లు రైతుల ఖాతాల్లో జమ కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

కొత్తకోట: మండలంలోని అప్పరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03లో పదో తరగతి వరకు కలిసి చదువుకొని విడిపోయారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారు 20ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకొనేందుకు చదువుకున్న పాఠశాలలోనే ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జరుపుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు సత్యనారాయణగౌడ్, భరత్‌కుమార్, పుల్లారెడ్డి, నర్సింహారెడ్డి, లక్ష్మీనారాయణ, లక్ష్మి, లక్ష్మీదేవి, సుజాతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నరేందర్‌గౌడ్, శివరాములు, విష్ణు, రఘునాథ్‌రెడ్డి, మేఘవర్ధన్‌రెడ్డి, సాయికుమార్‌రెడ్డి, శ్రీలత, రాధ, అరుణ, రాణి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు మున్నూరుకాపు సంఘం కల్యాణ మండపంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేష్, శేషయ్య, నాగయ్య, వెంకటేష్, ఆశన్న, అజీమ్, షాపురం శ్రీను, నరేందర్, తిర్పతమ్మ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో..



అప్పరాల జెడ్పీహెచ్‌ఎస్‌లో..



గోపాల్‌పేటలో..

మెడికల్ ఆఫీసర్‌కు సన్మానం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన నాయకంటి పరిమళ మదనాపురం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా నియమితులైన సందర్భంగా ఆదివారం ఆమె స్వగృహంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సన్మానించారు.

ఆకస్మికంగా మాజీ సర్పంచ్ మృతి



గోపాల్‌యాదవ్ (ఫైల్)

పెబ్బేరు: మండలంలోని రాంపురం మాజీ సర్పంచ్ గోపాల్‌యాదవ్(52) గుండెపోటుతో ఆదివారం ఉదయం మృతిచెందాడు. ఈయన 2000 సంవత్సరం నుంచి 2010 వరకు రెండు సార్లు గ్రామా నికి సర్పంచ్‌గా పనిచేశారు. అనంతరం 2011లో మరోసారి తన భార్యకు సర్పంచ్‌గా అవకాశం వచ్చింది. గోపాల్‌యాదవ్ మృతితో పలువురు రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు.